క్లుప్తంగా

నేటి నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీ సీతారామ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు రెండో ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు భద్రాచలం బ్యాడ్మింటన్ అసోసియేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టోర్నీలో మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలను విజేతలకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా ఈ పోటీలలో వైజాగ్, తిరుపతి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులకు వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీలలో పాల్గొనాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ సరఫరాలో నేడు(శనివారం) అంతరాయం కలుగుతున్నట్లు స్థానిక ఏడీఈ బి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేటలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నటు, సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సందర్భంగా సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని టీడీబంజార్ గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారులు ప్రియాంక, తన్మయి వైద్యశిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దగ్గు, జలుబు, గొంతునొప్పి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రమేష్, సీహెచ్‌ఓ పూలమ్మ, హెచ్‌ఈ జయలక్ష్మి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, ఆశలు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి


ఆర్డీఓతో బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో తుపాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మరావు మాట్లాడుతూ...అధికారులు వెంటనే పంటనష్టంపై సర్వే చేసి ప్రతీ ఎకరానికి రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ త్రినాథ్‌రావు, ఎర్రం రాజు బెహరా, నాగబాబు, రామ్మోహన్‌రావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, చక్రవర్తి పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: అనారోగ్యంతో మృతి చెందిన అశ్వాపురం పీఏసీఎస్ డైరెక్టర్, టీడీపీ నాయకుడు కందుల వీరయ్య మృతదేహానికి శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి, ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీటీసీలు తుళ్లూరి గంగాభవాని, ఏనిక రవి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు పాడియం అనిల్, వాసు, రమేష్, బొబ్బాల నాగేశ్వరరావు, పుల్లారెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెం వద్ద వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా, నారాయణపురం గ్రామం వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిమితికి మించి, లైవ్ జాకెట్ లేకుండా బోటులో పర్యాటకులను ఎక్కిస్తున్న నిర్వాహకులు




బోటు షికారు.. బేజారు!

పరిమితికి మించి పర్యాటకులను ఎక్కిస్తున్న నిర్వాహకులు
- భద్రాద్రిలో రక్షణ చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

నిబంధనలు ఇవీ..
- బోట్ షికారు నిర్వాహకుడు పంచాయతీ నిబంధనల ప్రకారం గోదావరిలో బోటులను నడపాల్సి ఉంటుంది.
- ప్రతీ బోటుకు లైసెన్స్ ఉండాలి. కండిషన్‌ను ప్రతీ రోజు తనిఖీ చేయాలి.
- బోటు ఎక్కిన ప్రతీ ఒక్కరికి లైవ్ జాకెట్ వేయాలి
- పంచాయతీ అధికారులు సూచించిన లెక్క ప్రకారం బోటులో పర్యాటకులను ఎక్కించుకోవాలి.
- బోటు గోదావరి మధ్య వరకు వెళ్లి వెనుతిరగాలి.
- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బోటును తిప్పాలి.
- బోటు నడిపే వ్యక్తులకు దానిపై పూర్తిస్థాయిలో పట్టు ఉండడంతో పాటు మద్యం సేవించకుండా ఉండేలా నిర్వాహకులు చూసుకోవాలి.

భద్రాచలంటౌన్: భద్రాచలం వచ్చిన భక్తులు, పర్యాటకులకు శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దర్శనంతో పాటు పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, బోట్ షికారు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. కానీ నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా పంచాయతీ నిబంధనలను తుంగలో తొక్కుతూ పరిమితికి మించి పర్యాటకులను ఎక్కించుకుంటూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కార్తీకమాసం కావడంతో భద్రాద్రికి భక్తులు, పర్యాటకుల తాకిడి భారీగా ఉంది. ఈ క్రమంలో సరదాగా గోదావరి నదిలో విహరిద్దామనే పర్యాటకుల ఆసక్తిని సొమ్ము చేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు షికారు నిర్వహించాలి కానీ ఆవిధంగా నిర్వాహకులు వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైన ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ప్రతీ రోజు వందల మంది పర్యాటకులను ఎలాంటి రక్షణ చర్యలు పాటించకుండా బోట్ షికారు పేరుతో గోదావరిలో తిప్పుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

శుభ్రమైన నీటిలో స్నానమని చెప్పి..

సుదూర ప్రాంతాల నుంచి భద్రాద్రి వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు గోదావరి నదిలో బోట్ షికార్ చేయకుండా వెనుతిరగరు. ఇదే అదునుగా భావించిన గోదావరి భక్తులను శుభ్రమైన నీటిలో స్నానాలు చేయవచ్చు అన్ని భక్తులకు చెప్పి గోదావరి మధ్యలో తెలిన ఇసుక దిబ్బలపై వదులుతున్నారు. నిర్వాహకులు గోదావరి ఒడ్డుపై ఉన్న బురదను సాకుగా భక్తులకు చెప్పి నది మధ్యలోని ఇసుక దిబ్బలపైకి తీసుకెళ్తున్నారు. అక్కడ దిగిన భక్తులు ఇష్టారాజ్యంగా గోదావరి నదిలో దిగి స్నానాలు చేస్తున్నారు. గోదావరిలో లోతుపై పూర్తి స్థాయిలో అవగాహన లేని భక్తులను అలా వదిలేయడంతో లోతు అంచనా వేయలేక ఏదైన ప్రమాదం జరితే బాధ్యత ఏవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పరిమితికి మించి పర్యాటకులను ఎక్కించకూడదు. అలాగే సెఫ్టీ జాకెట్లు పర్యాటకులకు ఇవ్వకపోయిన చర్యలు తీసుకునే హక్కు పంచాయితీ అధికారులకు ఉంటుంది. కానీ ఇక్కడ బోట్ షికార్ యాజమాన్యం బోట్‌లో పర్యాటకులను పరిమితికి మించి ఎక్కించుకోవడంతో పాటు ఎటువంటి సెఫ్టీ జాకెట్లు ఇవ్వడంలేదు. దీంతో ఎదైన ప్రమాదం జరిగితే ప్రాణాలు నీళ్ల పాలు కావాల్సిందేననే అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, పాటించకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం ..

బోట్ షికార్ నిర్వాహకులు పంచాయతీ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. గోదావరి మధ్యలో భక్తులను దించొద్దని ఇప్పటికే యాజమాన్యాన్ని హెచ్చరించాం. మరోసారి చెప్పి చూస్తాం మారకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, భద్రాచలం పంచాయతీ ఈఓ.

మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు


భట్టిని సన్మానిస్తున్న నాయకులు

చర్ల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, నాయకులు సోడి చలపతిరావు, కనుబుద్ది దేవా, వనం ప్రదీప్తం, వీరారెడ్డి, డింగి సందీప్‌రెడ్డి తదితరులు వారిని కలిసి సన్మానించచారు. అలాగే, నియోజకవర్గంలోని సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు.


మంత్రి, ఎమ్మెల్యేతో నాయకులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కాంగ్రెస్ పార్టీ నాయకులు హైద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో జూపల్లి రమేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంజి ఉన్నారు.


కరకగూడెం: మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న లింగయ్య

కరకగూడెం: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రి సీతక్కను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వాటర్స్‌లో మాజీ ఎమ్మెల్యే, జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు చందా లింగయ్య దొర కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని కోరారు.


మణుగూరు టౌన్: తుమ్మలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయం, నాయకులు

మణుగూరు టౌన్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ ముఖ్య నేతలతో సహా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, చందా సంతోష్, నియోజకవర్గ నాయకులు బట్టా విజయ్‌గాంధీ, తోలెం నాగేశ్వరరావు, కొమరం లక్ష్మణరావు, తాళ్లూరి చక్రవర్తి, ఆవుల సర్వేశ్వరరావు, వాసుదేవరావు ఉన్నారు.

కార్తీక మాస ఏకాదశి పూజలు


దమ్మపేట: సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు


అన్నపురెడ్డిపల్లి: స్వామి వారికి అన్నాభిషేకం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో శుక్రవారం కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఏకాదశ రుద్రాభిషేకాలు, అభిషేకాలు, గోత్రనామార్చనలు, విశేషంగా అన్నాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

సామూహిక వ్రతాలు..

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ రావు గంగాధర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వ్రతంలో దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా వారి మందిరంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, కోశాధికారి కుంచాల రమేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు ఉచిత ప్రయాణంపై హర్షం

మణుగూరు టౌన్: తెలంగాణ రాష్ట్ర తొలి క్యాబినెట్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటైన మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం నిర్ణయంపై మండల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా మహిళలకు కానుకగా ఉచిత బస్సు ప్రయాణం నిర్ణయం అభినందనీయమన్నారు. మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవిరావు, ఉప సర్పంచ్ పుచ్చకాయలశంకర్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కాటబోయిన నాగేశ్వరరావు, కొర్సా ఆనంద్, బీసీ సంఘం నేత పెనుగొండ సాంబశివరావు, గాండ్ల సురేశ్ తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరాయిగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కారణంగా పూరిల్లు కూలిన ఘటన శుక్రవారం జరిగింది. వెంటనే స్పందించిన స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని అందులో ఉన్న తల్లిబిడ్డను క్షేమంగా బయటకు తీసుకురాగా, ఒంటరి మహిళకు ఉన్న ఆధారం లేకుండా పూర్తిగా కుప్పకూలింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈసాల వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి బీరా రమేష్‌లు బాధితురాలిని పరామర్శించారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి బాధితురాలికి వెంటనే న్యాయం చేయాలని కోరారు.


నిరాశ్రయురాలైన పుష్పమ్మ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు అసోదు పుష్పమ్మ పూరిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో గూడు కోల్పోయి తల్లి, కొడుకు రోడ్డున పడ్డారు. దాతలు చేయూత అందించాలని బాధితురాలు కోరుతోంది

నష్టాన్ని పారదర్శకంగా నమోదుచేయాలి


దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

చర్ల/చర్ల రూరల్: తుపానుతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టం అంచనాను అధికారులు పారదర్శకంగా నమోదు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. చర్ల మండలంలోని జీ.పీ.పల్లి, వీరాపురం, మొగుళ్లపల్లి, చింతకుంట, గొంపల్లి, లింగాపురం, కొత్తపల్లి, చర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించిన ఆయన పంటలను పరిశీలించి నష్టంపై రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, ఏఓ పి.శివరాంప్రసాద్, ఏఈఓ ఆఫ్రిద్‌తో పాటు సోయం రాజారావు, పోలిన లంకరాజు, కొటేరు శ్రీనివాస రెడ్డి, కొసరాజు రాజాబాబు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని బండిరేవు, పెదనలబల్లి గ్రామాల్లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కనితి రాముడు, సర్పంచ్‌లు మట్టా వెంకటేశ్వరావు, సోడే జ్యోతి, రైతులు పాగాకు నర్సింహారావు, కొమ్ము వెంకటేశ్వర్లు, తంతరపల్లి జోగేశ్వరావు, పిట్టా శ్రీనివాసరావు, యలగందుల రంగయ్య నాయకులు మోతుకూరి శ్రీకాంత్, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కిందపడ్డ వరిని పైకిలేపి కట్టలు కట్టాలి


చంద్రుగొండ: రావికంపాడులో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ అఫ్జల్‌బేగం


కరకగూడెంలో..

చంద్రుగొండ: తుఫాన్ వర్షాల ప్రభావంతో కిందపడిపోయిన వరిని పైకిలేపి కట్టలు కట్టుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ అఫ్జల్‌బేగం రైతులకు సూచించారు. మండలంలోని చంద్రుగొండ, తిప్పనపల్లి, గానుగపాడు, రావికంపాడు, పోకలగూడెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు తడిసిన పంటలను కాపాడుకునే విధానంపై పలు సూచనలు చేశారు. వరిపనలను ఎత్తి కట్టుకోవాలని, పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఆమె పర్యటించారు. ఆమె వెంట ఏఓ వినయ్, ఏఈఓలు విజయ్, సాయిభాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టం నివేదిక అందజేస్తాం..

కరకగూడెం: తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న వరి, మిరప, పత్తి పంటలను మండల వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఏఈఓలు ప్రశాంత్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మించాలి


కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ములకలపల్లి : మార్కెట్ యార్డు గోడౌన్ సమీపంలో పాములేరువాగు బ్రిడ్జి వద్ద కోతకు గురవుతున్న ప్రదేశంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఘటనా ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. వాగుపై చెక్ డ్యాం నిర్మించడంతో భారీగా నీరు నిలిచి, సైడ్‌బర్మ్ కోతకు గురైతుందని, సకాలంలో చర్యలు చేపట్టకపోతే, ఆర్అండ్‌బీ రోడ్డు తెగిపోయే ప్రమాదముందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, చనగాని వినోద్, సురేందర్, వెంకటేశ్వర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత


ప్రభుత్వ భూమిలో పోసిన ఇసుక, ఇటుకలు

మణుగూరుటౌన్: మండలపరిధిలోని ముత్యాలమ్మ నగర్ పంచాయతీలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మిస్తున్న సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం నిలిపివేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న అధికారులు 314 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని తహసీల్దార్ చంద్రశేఖర్ స్వాధీనం చేసుకోగా, అందులో కొంత రైల్వే ట్రాక్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణానికి కేటాయించారు. కాగా ఇప్పుడు దాని సమీపంలోని స్థలంలో రాత్రివేళల్లో నిర్మాణాలు చేస్తూ కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాఘవరెడ్డి ఆర్ఐ శ్రీనివాస్‌ను పంపి ప్రభుత్వ భూమిని పరిశీలించి నిర్మాణాన్ని నిలిపివేయాలని బాధ్యులను హెచ్చరించారు.

వైభవంగా నగర సంకీర్తన


నగర సంకీర్తన చేస్తున్న మాలధారులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో అయ్యప్ప మాలధారులు శుక్రవారం నగర సంకీర్తన చేపట్టారు. గ్రామంలోని శ్రీ దాసాంజనేయ ఆలయం నుండి పురవీధుల గుండా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పడిపూజ చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పూదోట శ్రీనివాస్, వేముల శ్రీనివాసరావు, జీరి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పతివాడ జగదీష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే నష్టపరిహారం అందించాలి


అశ్వారావుపేటరూరల్: పొగాకు తోటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా


ములకలపల్లిలో..

అశ్వారావుపేటరూరల్: మించాగ్ తుపాను కారణంగా నష్టపోయిన బాధిత రైతాంగానికి తక్షణమే ప్రభుత్వ నష్టపరిహారాన్ని ఇవ్వాలని తాజా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. మండలంలోని జమ్మిగూడెం, గుర్రాల చెరువు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, తుఫానుతో దెబ్బతిన్న పంటలతోపాటు ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. అలాగే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సూచించారు. సర్పంచ్ నారం రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, మందపాటి మోహన్ రెడ్డి, గుడవర్తి వెంకటేశ్వరరావు, తాడేపల్లి రవి పాల్గొన్నారు.

మిచాంగ్ తుఫాను కారణంగా నష్టానికి గురైన బాధిత రైతులందరిని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్, కల్లూరి కిషోర్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు కోరారు.

దమ్మపేట: మండల పరిధిలోని వరద ప్రాభావిత ప్రాంతాలను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు. గండిపడిన పేరంటాల చెరువును, వరద వలన నష్టపోయిన పంటలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. జెడ్పీటీసీ పైడీ వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, మల్లిఖార్జునరావు, సోయం వీరభద్రం, దొడ్డా రమేష్ , గాజుబోయిన ఏసు, శ్రీను పాల్గొన్నారు.

ములకలపల్లి : మండలంలో అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యం రాశులు, వేరుశనగ పంటలను సీపీఐ నాయకులు పరిశీలించారు. అనంతరం బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నరాటి రమేశ్, భిక్షం, భూక్యా వెంకటేశ్వర్లు, ఊకే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.